

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పావని, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రెడ్డి

సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీల నివారణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కార్పొరేటర్ పావని, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్లు, కాలనీలు, దుకాణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామిదాస్, కార్యదర్శి మల్లేష్, మాజీ కార్యదర్శులు మురళి, సత్యనారాయణ, కమిటీ సభ్యులు మితేశ్, సుధాకర్, రామ్‌మోహన్, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్‌కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు



రోడ్లపై చెత్త వేయొద్దని వ్యాపారులకు సూచిస్తున్న జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ దేవేందర్

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ శానిటేషన్ సూపర్‌వైజర్ దేవేందర్ హెచ్చరించారు. రాంనగర్‌లో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారులు షాపుల్లోని చెత్తను రోడ్లపై వేయవద్దని, స్వచ్ఛ ఆటోలో వేయాలని సూచించారు. షాపుల ఎదుట, రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని, ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు అమ్జాద్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేత అన్యాయం

చిక్కడపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తమ ఇళ్లను కూల్చిన చోటే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్ బస్తీవాసులు చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం స్పందించకపోవడం తగదని దళిత బహుజన ఫ్రంట్ కార్యదర్శి పులి కల్పన అన్నారు. బాధితులు 71 రోజుల నుంచి చేస్తున్న దీక్షలో ఆమె సోమవారం పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ.. 75 సంవత్సరాలుగా నివసిస్తున్న 65 కుటుంబాల ఇళ్లను కూల్చివేయడం అన్యాయమన్నారు. దీక్షలో బస్తీ నేతలు కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్, పూజ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కె. రాజశేఖర్‌గుప్తా, వి. రాజుగుప్తా తదితరులు

వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకుని సోమవారం మధ్యాహ్నం రాంనగర్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బుక్కా రమేష్ గుప్తా, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ మిలీనియం సౌజన్యంతో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని రాంనగర్ సేవా సమితి చైర్మన్ కె.రాజశేఖర్‌గుప్తా, అధ్యక్షుడు వాడకట్టు రాజుగుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతినెల అమావాస్య రోజున సేవా సమితి ఆధ్వర్యంలో 500 నుంచి వెయ్యి మంది పేదలకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి కోశాధికారి గంజి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చల్లా శివకుమార్, సభ్యులు అంజనేయులుగుప్తా, వీరేందర్‌గుప్తా, కె.యాదగిరిగుప్తా, రామనాథం గుప్తా, ఎర్రం చంద్రశేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు సింగారపు రమేశ్‌గుప్తా అన్నారు. సోమవారం వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో సంఘం ఆధ్వర్యంలో దాత ప్రొద్దుటూరి నరసింహారావు, సహ దాత వెంకటసుబ్బయ్య సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలను రమేశ్‌గుప్తా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి చేపూరి లక్ష్మణ్, అడిషనల్ సెక్రటరీ అమర బాలకుమార్, కోశాధికారి చిట్టిమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్‌నగర్‌లో లోప్రెషర్ సమస్యను పరిష్కరిస్తాం



ఆజాద్‌నగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆజాద్‌నగర్‌లో తాగునీటి సరఫరా లోప్రెషర్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని కార్పొరేటర్ విజయక్‌కుమార్‌గౌడ్ బస్తీవాసులకు హామీ ఇచ్చారు. అంబర్‌పేట డివిజన్ ఆజాద్‌నగర్‌లో సోమవారం ఆయన పాదయాత్ర చేశారు. లోప్రెషర్ సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బస్తీవాసులు, బీఆర్ఎస్ నాయకులు, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.

కోయ భాష అకాడమీ ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోయ భాష అభివృద్ధికి అకాడమీ ఏర్పాటు చేయాలని కోయ భాష లిపి, సృష్టికర్త చిలుకూరి అమరవరప్రసాద్ కోరారు. కోయభాష లిపితో పాఠ్యాంశాలను ముద్రించి ప్రాథమిక విద్యాస్థాయిలో బోధించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కోయ భాష సంస్కృతి, అభివృద్ధి సంస్థ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కోయలు జీవనం సాగిస్తున్న చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో కూడా కోయ భాష లిపిని అమలు చేయాలని కోరారు.

కార్యవర్గం

భాషాభివృద్ధికి కోయ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా ప్రొఫెసర్ రేగా రాజేందర్, అధ్యక్షుడిగా గొండి వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా కె.శంకర్‌రావు, సెక్రటరీ జనరల్‌గా ప్రొఫెసర్ జి.అనురాధ, జనరల్ సెక్రటరీగా ప్రొఫెసర్ కిషోర్, కోశాధికారిగా డాక్టర్ కె.పద్మజ, సంయుక్త కార్యదర్శి ప్రొఫెసర్ నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా పూసం వెంకటలక్ష్మి నియమితులైనట్లు ఆయన తెలిపారు.

'మాల, మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

కవాడిగూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మాదిగలు, మాదిగ ఉపకులాలు, మాలలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలి నియామకంతో పాటు, నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశామని ఎస్సీ 57 ఉపకులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం తెలిపారు. సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ ఉపకులాలకు ఎమ్మార్వో ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లను ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో ఆలిండియా బేడబుడగ జంగాల ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ చింతల యాదగిరి, ఎస్సీ ఉపకులాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ చంద్రగిరి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి బాణాల మంగేష్, ఉపాధ్యక్షుడు ఏర్పుల యాదయ్య, అధికార ప్రతినిధి రాజ దశరథ్ తదతరులు పాల్గొన్నారు.

మాదిగలకు ఎంపీ సీట్లు కేటాయించకపోతే

16 నుంచి చావుడప్పు మోగిస్తాం

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించకపోవడంపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. ఈనెల 15వ తేదీ లోపు మాదిగలకు ఎంపీ సీట్లు కేటాయించకపోతే 16 నుంచి గాంధీ భవన్‌తోపాటు పార్లమెంట్ నియోజకవర్గాల్లో చావుడప్పు మోగిస్తామని ఆయన హెచ్చరించారు. సోమవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ టికెట్ల కేటాయింపులో మాదిగలను విస్మరించిన కాంగ్రెస్‌ను లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన రాజకీయ ఎదుగుదలకు మాదిగలే ప్రధాన కారణమనే విషయాన్ని విస్మరించారని అన్నారు. రెండు ఎంపీ సీట్లను మాదిగలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎన్. నరసింహ, కొల్లూరి వెంకట్, రాజేష్, జిల్లా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతాం

కవాడిగూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళిత జనాభాలో 75 శాతం ఉన్న మాదిగ సామాజిక వర్గానికి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కవాడిగూడ డివిజన్ ఎల్ఐసీ కార్యాలయ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు ఎస్సీ రిజర్వుడు ఎంపీ స్థానాల్లో 27 శాతం ఉన్న మాలలకు రెండు సీట్లు, ఒక శాతం ఉన్న బైండ్ల సామాజిక వర్గానికి ఒక సీటు కేటాయించడం తగదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకుల పర్యటనలను, ప్రచారాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగేష్, జెర్రిపోతుల సత్యనారాయణ, నర్సింహ, ఎం. రవీందర్, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ ప్రియాంక



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ దీప్తి ప్రియాంక

ముషీరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత, వడగాలుల కారణంగా వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంక సూచించారు. సోమవాంరం యూపీహెచ్‌సీలో వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి వచ్చిన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వడదెబ్బ తగిలి డీ హైడ్రేషన్ బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ద్రవపదార్థాలు, నీళ్లు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఫార్మాసిస్ట్ శిరీషా, ల్యాబ్ టెక్నీషియన్ రత్నమాల, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

17 ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తాం



మాట్లాడుతున్న సోషలిస్ట్ పార్టీ ఇండియా రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రారెడ్డి

నల్లకుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలలో పోటీ చేస్తున్నామని సోషలిస్ట్ పార్టీ ఇండియా రాష్ట్ర అధ్యక్షురాలు రవ్వ.సుభద్రారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు 11 మంది అభ్యర్థులను ఆమె ప్రకటించారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కుల నిర్మూలన, సమసమాజ నిర్మాణమే సోషలిస్ట్ పార్టీ ఇండియా ఏకైక లక్ష్యమన్నారు. యువత, మహిళలను ముందుకు తీసుకెళ్లే దిశగా పార్టీ పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అవినీతిమయంగా మారాయని ఆమె ఆరోపించారు. ఈవీఎంలకు తమ పార్టీ వ్యతిరేకమని, వాటిని నిషేధించాలని డిమాండ్ చేశారు. బీవీ రమేష్‌బాబు(చేవెళ్ల), అంబి.హనుమంతరావు(హైదరాబాద్), సునీతా రాణి(సికింద్రాబాద్), గట్టు రాణాప్రతాప్‌గౌడ్(కరీంనగర్), లక్‌పతి నాయక్(మహబూబ్‌నగర్), కనకన్న(పెద్దపల్లి), రాయిస్ అన్వర్ (ఖమ్మం), గాలి.రాజుపూలే(నాగర్‌కర్నూల్), గాలి.దుర్గాబాయి(వరంగల్), నల్లగొండ, భువనగిరి నుంచి తాను పోటీ చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సమావేశంలో పార్టీ మహిళా కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ సుమిత్రా రాయ్, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, ఉపాధ్యక్షులు డి. లీలా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు

కాచిగూడలో కార్డన్ సెర్చ్

- పత్రాలు లేని 20 బైక్‌లు స్వాధీనం

బర్కత్‌పుర ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధి సుందర్‌నగర్‌లో పోలీసులు సోమవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 110 మంది పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పత్రాలు లేని 20 ద్విచక్రవాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ రఘు, సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు.

ఆప్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు

కవాడిగూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు ఆమ్ ఆద్మీ పార్టీ లిబర్టీలోగల కార్యాలయంలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, నాయకులు బి. రాములుగౌడ్, సాల్మన్‌రాజు, ఎంఏ మాజిద్, నర్సింగ్, యమునగౌడ్, జావేద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఆప్ కార్యాలయంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ముస్లింలు

బీఎల్ఎఫ్ ఎంపీ అభ్యర్థుల రెండో జాబితా విడుదల

రాంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల రెండో జాబితాను బహుజన లెఫ్ట్ ఫ్రంట్ సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఓంకార్ భవనంలో ప్రకటించింది. వరంగల్ నియోజకవర్గం నుంచి ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం. సావిత్రి, నాగర్‌కర్నూలు నుంచి అంబేడ్కర్ వాది కంబాని బాలస్వామి పోటీ చేస్తారని బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ తెలిపారు. మొదటి జాబితాలో ఐదుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించామన్నారు. బహుజనులందరూ బీఎల్ఎఫ్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ కన్వీనర్ దండి వెంకట్, నాయకులు దొంతు రమేష్, ఉపేందర్‌రెడ్డి, వనం సుధాకర్, కుమారస్వామి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారగ్రహీతలతో అతిథులు

పలువురికి ఉగాది పురస్కారాలు ప్రదానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, సర్వజన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయగానసభలో వివిధరంగాల ప్రముఖులకు ఉగాది పురస్కారాల ప్రదానసభ, ఉగాది కవిసమ్మేళనం ఘనంగా జరిగింది. గుండావజ్ఝుల జ్యోతిర్మయి, డి. శశినాయుడు, కానూరి జయశ్రీ, మాగంటి ప్రసాద్ బాబు, నరసింహులుగౌడ్, మాగంటి శ్రీధర్‌బాబు, డా.కోనేరు లక్ష్మీప్రమీల, వాసిరెడ్డి జ్యోతి, లయన్ఎస్ సువర్ణరెడ్డి, వాసిరెడ్డి రాధిక, ఎ. సరస్వతి, ఎస్. రజితకు ఉగాది పురస్కారాలు అందజేశారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఐఏఎస్ విశ్రాంత అధికారి డీవీ రావు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి హుస్సేన్ సాహెబ్, రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఎన్. వేణుగోపాలశర్మ, మహేష్‌చంద్ర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహేష్ చంద్ర, సర్వజన సేవా ట్రస్టు చైర్మన్ ఉన్నం బాబురావు, నిర్వాహకుడు మురళీమోహన్‌రాజు, రచయిత్రి డా. రాధా కుసుమ, సినీ దర్శకుడు రాంగోపాల్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.



పూలే ఉత్సవాల కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలంయాదవ్‌ను సత్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

200 అడుగుల పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక సంఘ సంస్కర్త, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతీరావు పూలే 200 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జ్యోతీరావు పూలే జయంతి ఉత్సవాల రాష్ట్ర స్థాయి నిర్వహణ కమిటీ చైర్మన్‌గా చిన్న శ్రీశైలం యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో 5 ఎకరాల్లో జ్యోతీరావు పూలే స్మృతివనాన్ని నిర్మించాలని కోరారు. చిన్న శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ..

ఈనెల 11న నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పూలే జయంతి నిర్వహిస్తున్నామని తెలిపారు. బీసీ సంఘాల నేతలు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్‌గౌడ్, కనకాల శ్యామ్‌కుర్మ, సదానందం, శ్రీనివాస్‌గౌడ్, స్వర్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాగదేవత ఆలయంలో చండీహోమం

కవాడిగూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం లోయర్ ట్యాంక్‌బండ్ నాగదేవత ఆలయంలో రజకులు వేదపండితుడు నరేంద్ర ఆధ్వర్యంలో సోమవారం చండీ హోమం నిర్వహించారు. రజక సంఘం నాయకులు కొమురయ్య, ముత్యాలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ వద్ద మానవత్వపు గోడ తొలగింపు



చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం వద్ద తొలగించిన మానవత్వపు గోడ వద్ద పడేసిన దుస్తులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నగర కేంద్రగ్రంథాలయ సంస్థ ప్రహరీ వద్ద గతంలో ఏర్పాటు చేసిన మానవత్వపు గోడను తొలగించారు. ఎవరైనా ఇళ్లలోని పాత దుస్తులు, వాడనివి ఈ గోడవద్ద వేస్తే పేద ప్రజలకు ఉపయోగపడతాయనే సదుద్దేశ్యంతో డా.లక్ష్మణ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మానవత్వపు గోడను ఏర్పాటు చేశారు. చాలా కాలంగా దీన్ని పట్టించుకోవడం లేదు. దీంతో దుస్తులు కుప్పగా ఉండడంతో అక్కడ అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. ప్రజలు పాత దుస్తులు ఫుట్‌పాత్‌పై వేసి వెళ్తున్నారు.

కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి



గోవర్ధన్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న రోహిణ్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కందగట్ల గోవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్ రెడ్డి ఆయనకు సోమవారం నియామక పత్రం అందజేశారు. పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని గోవర్ధన్‌రెడ్డి అన్నారు.

అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ కో-కన్వీనర్‌గా రాజు



అంబర్‌పేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ కో-కన్వీనర్‌గా మైలారం రాజు నియమితులయ్యారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు సోమవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో బీజేపీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు.

వేణుగోపాలరావు మృతి సంగీత రంగానికి తీరనిలోటు

చిక్కడపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, నాట్య, సంగీత రంగ ప్రముఖులు పప్పు వేణుగోపాలరావు మృతి సంగీత, నాట్యరంగాలకు తీరని లోటు అని కేంద్ర సంగీత, నాటక అకాడమీ కౌన్సిల్ సభ్యురాలు డా. ఎస్.పి. భారతి అన్నారు. వేణుగోపాలరావు ఆదివారం రాత్రి చెన్నైలో మృతిచెందారని సంతాపం ప్రకటించారు. ఆయన రచించిన నాట్య, సంగీత రంగ గ్రంథాన్ని తనకు ఇటీవల అందజేశారని భారతి తెలిపారు.







ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362